Postal License No.VJ/220/2023-25



నేటి పత్రిక
# ప్రజా వార్త
NETI PATRIKA PRAJA VARTHA
తెలుగు వార పత్రిక

TELUGU ONLINE
DIGITAL NEWS
PORTAL &
ONLINE CHANEL
Prajavatha-Online Telugu News
http://www.prajavartha.com
వీక్షించండి.. చదవండి... చెప్పండి...

విజయవాడ | తేదీ : 8-15 మే 2025 | సంపాదకులు : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి: 04 | సంచిక : 48 | పేజీలు : 4 | రూ. 5.00

## లోతైన అధ్యయనంతోనే రాష్ట్ర ఆదాయంలో పెరుగుదల

### ఆదాయార్జన శాఖల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్ర ఆదాయం మరింతగా పెంచేందుకు ఉన్న అనుకూలతలు, వేగంగా వృద్ధి చెందడానికి గల అవకాశాలపై ఆదాయార్జన శాఖలన్నీ లోతైన అధ్యయనం చేయాలని... అంతిమంగా రాష్ట్ర ఆదాయం భారీఎత్తున పెరిగేలా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. గడిచిన 30 ఏళ్ల ఆదాయ ఫలితాలను పరిశీలించి భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయం పెంచుకునేందుకు ఎలక్ట్రానిక్స్, ఐటీ, సేవల రంగాలు ఎక్కువగా దోహదం చేస్తాయని ముఖ్యమంత్రి అన్నారు. మంగళవారం సచివాలయంలో ఆదాయార్జన శాఖలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో శాఖల వారీ పురోగతిపై చర్చించారు. మరోవైపు బంగారం అత్యధికంగా కొనుగోలు చేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందున్నప్పటికీ... పన్ను ఆదాయం ఆస్థాయిలో ఎందుకు లేదో అధికారులు దృష్టి పెట్టాలని... పన్ను ఎగవేతలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల సమాచారంతో డేటా లేక్ ఏర్పాటు చేయాలని... ప్రతిశాఖకు ఏఐ బృందం ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. పన్ను చెల్లింపుదారులకు ఏఐ టూల్ ద్వారా సేవలు అందించేలా వచ్చే రెండు, మూడు నెలల్లో ఏఐ ఆధారిత పన్నుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

**మద్యం సరఫరా, అమ్మకాల ట్రాకింగ్...** పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం అక్రమంగా రాష్ట్రంలో విక్రయించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మద్యం విక్రయాలు పారదర్శకంగా జరిగేలా సరఫరా దగ్గర నుంచి అమ్మకం వరకు... ప్రతీది రియల్ టైమ్‌లో ట్రాక్ చేయాలని చెప్పారు. కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో రవాణా శాఖ ఆదాయం పెరుగుతుంటే... ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు తక్కువగా ఆదాయం వస్తోందని ముఖ్యమంత్రి అధికారులను ప్రశ్నించారు. దీనికి కారణాలు అన్వేషించి వెంటనే, సరైన విధానాలను అవలంభించి ఆదాయం పెరిగేలా చూడాలని చెప్పారు. నెలవారీ లక్ష్యాలను అధిగమించేలా ఆదాయార్జన శాఖలు ప్రయత్నించాలని అన్నారు.

**ఎర్రచందనం నిల్వలపై సమగ్ర అధ్యయనం...** రాష్ట్రంలో ఎర్రచందనం నిల్వలను అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించేలా కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. వేల కోట్ల రూపాయల విలువైన ఎర్రచందనం మన రాష్ట్రానికి మాత్రమే సొంతమని... దీనిని విక్రయించడం ద్వారా పెద్దఎత్తున ఆదాయం ఆర్జించవచ్చన్నారు. రాష్ట్రంలో ఎన్ని టన్నుల ఎర్రచందనం నిల్వలు ఉన్నాయి...వాటి విలువ ఎంత అనేదానిపై కమిటీ స్పష్టమైన నివేదిక ఇవ్వాలని చెప్పారు.

**29 శాతం అధికంగా ఆదాయార్జన లక్ష్యం...** వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, గనులు, అటవీ.. ఇలా అన్ని రకాల ఆదాయాలు కలిపి 2025-26 సంవత్సరానికి రాష్ట్ర సొంత ఆదాయం రూ. 1,34,208 కోట్లు ఆర్జించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇది గత ఏడాది కన్నా 29 శాతం అధికం. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి మే 11 వరకు వాణిజ్య పన్నులు, అటవీ ఆదాయంలో తగ్గుదల కనిపించగా, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నుంచి అనూహ్యంగా ఆదాయం పెరిగింది. అటు, ఈ ఆర్థిక సంవత్సరం మే 11 వరకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆదాయం గతేడాది కన్నా 26 శాతం తగ్గింది. 2024-25లో ఇదే కాలానికి కేంద్రం నుంచి రూ. 17,170 కోట్లు రాగా... ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 12,717 కోట్లు మాత్రమే వచ్చింది అని అధికారులు వివరించారు.

**కొత్త ఎక్సైజ్ పాలసీతో పెరిగిన ఆదాయం...** రాష్ట్రంలో కొత్తగా తీసుకువచ్చిన ఎక్సైజ్ పాలసీతో ఆదాయంలో వృద్ధి నమోదైంది. 2024-25లో రాష్ట్రానికి ఎక్సైజ్ ఆదాయం రూ. 28,842 కోట్లు వచ్చింది. ఇది అంతకుముందు ఏడాది కన్నా 14.84 శాతం ఎక్కువ. అయితే దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కర్నాటకతో పోల్చుకుంటే ఏపీలో ఎక్సైజ్ ఆదాయం ఇప్పటికీ తక్కువగానే ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెలలో రాష్ట్రానికి రూ. 2,116 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది మొత్తం ఎక్సైజ్ ద్వారా రూ. 33,882 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నట్లు అధికారులు వివరించారు.

**హైదరాబాద్ లేని లోటు పూడ్చుకోవాలి...** తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ నుంచే 75 శాతం ఆదాయం వస్తుందని...మనకు అటువంటి అవకాశం లేనందున ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సిఎం చంద్రబాబు అన్నారు. ఏడాది కాలంలో తీసుకువచ్చిన పాలసీలను పటిష్టంగా అమలు చేయడం ద్వారా రాష్ట్ర ఆదాయం పెరిగేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సొంత ఆదాయ వనరులు పెంచుకుని తన కాళ్లపై తాను నిలబడాల్సిన అవసరం ఉందని...అప్పుడే అభివృద్ధి, సంక్షేమ పథకాలకు విరివిగా నిధులు ఖర్చు చేయగలం అని సిఎం అన్నారు. కేంద్ర సాయం, అప్పులు అనేది ప్రాథమిక దశలో నిలబడేందుకు మాత్రమే ఉపయోగపడతాయని.... మంచి పనితీరు ద్వారా ఆయా శాఖల్లో ఆదాయం పెరిగే ప్రణాళికలు అమలు చేయాలని సిఎం అధికారులకు స్పష్టం చేశారు. ఒకటి రెండు శాఖలు ఏడాది కాలంలో అనుకున్నంత పురోగతి సాధించలేదని....ఆయా శాఖల పనితీరు మెరుపడాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి తెలిపారు.


## సైనికుల సంకల్పానికి దైవ బలం తోడుండాలి



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : 'దేశ ప్రజలంతా భారత సైన్య పరాక్రమాన్ని చూశారు. అమాయకులైన 26 మంది పర్యాటకుల్ని పెహల్గాంలో పొట్టన పెట్టుకున్న ఉగ్రమూకల్ని తుద ముట్టించడమే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ ద్వారా శత్రువును బలమైన దెబ్బ కొట్టాం. ఈ కీలక సమయంలో దేశ ప్రజల ఐక్యత మరోసారి నిరూపితమైంద'ని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి, జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. సైన్యానికి దేశ ప్రజలందరి మద్దతుతోపాటు, దైవ బలం మెండుగా ఉండాలని ప్రార్థిస్తూ ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో మంత్రి మనోహర్ తో పాటు శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, జనసేన నాయకులు దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి వేదపండితులు ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ వెలుపల మీడియాతో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... "అమ్మవారి ఆశీస్సులు మన దేశ సైనికులకు తోడుగా ఉండాలని దుర్గమ్మకు పూజలు చేశాం. దేశ ప్రజల మనోబలంతో భారత సైనికులు ప్రతి అడుగు ముందుకు వేస్తూ ముష్కరులను తుద ముట్టించేలా చూడాలని ప్రార్థించాం. వర్తమాన రాజకీయాల్లో దేశం కోసం అందరిలో స్ఫూర్తి నింపుతూ, జాతీయతా భావాన్ని యువతలో తీసుకొచ్చేలా జనసేన పని చేస్తుంది. పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలనుసారం జనసేన ఎమ్మెల్యేలు, నాయకులు, వీర మహిళలు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటకతోపాటు ఇతర రాష్ట్రాల్లో కూడా పూజలు చేస్తున్నారు. సైనికుల సంకల్ప బలానికి దైవ బలం తోడుగా ఉండాలని అన్ని చోట్లా పార్టీ శ్రేణులు పూజల్లో పాల్గొంటున్నారు.

అమాయకులైన పర్యాటకులను ఉగ్రవాదులు అన్యాయంగా పొట్టన పెట్టుకున్నారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని కూడా పాకిస్థాన్ ఉల్లంఘించి మళ్లీ కాల్పులకు తెగబడటం ఆ దేశ నిజ స్వరూపాన్ని బయటపెడుతోంది. మన భారత సైన్యం ఎలాంటి దాడిని అయినా దీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంది. పాకిస్థాన్ చర్యల వల్ల మరోసారి సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితి కనిపిస్తుంది. ఇలాంటి కీలకమైన సమయంలో దుర్గమ్మ అనుగ్రహం మన సైనికులకు ఉండాలని వేడుకున్నాం. గత ఏడాది ఎన్నికలు ఇదే సమయానికి జరుగుతున్నాయి. ఆ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారు. ప్రజల శ్రేయస్సు కోసం, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం కూటమి నేతలంతా కలిసి కట్టుగా ముందుకు సాగుతున్నాం. రాష్ట్ర ప్రజలకు అంకిత భావంతో పని చేసేలా వచ్చిన అవకాశాన్ని నిలబెట్టుకుంటాం. ఆలయాలతో పాటు చర్చిలు, మసీదుల్లో కూడా సైనికులకు అండగా ఉండేలా జనసేన నాయకులు ప్రార్థనలు నిర్వహిస్తున్నారు" అన్నారు. ఈ సందర్భంగా శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ... "సరిహద్దుల్లో మన దేశ సైనికులు చూపుతున్న పోరాటం అసమానం. వారి నిరంతర అప్రమత్తత కారణంగానే మనం ప్రశాంతంగా ఉండగలుగుతున్నాం. అలాంటి సైనికుల పరాక్రమానికి దైవబలం తోడుగా ఉండాలని పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనల మేరకు దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించాం. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో సైతం జనసేన ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దేశం బాగు కోసం మన సైన్యం సంకల్ప బలానికి తోడు దైవ బలం కూడా ఉంటే వారికి మరింత మనోస్థైర్యం లభి మీస్తుంది. జనసేన పార్టీ ఎల్లపుడూ జాతీయ భావాన్ని పెంపొందించేలా ముందుకువెళ్తుంది. దేశ భక్తిని యువతలో నింపడానికి పవన్ కళ్యాణ్ నిత్యం తపిస్తారు. ఆయన బాటలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకు వెళ్తాం" అన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను, కృష్ణా జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ, పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, పార్టీ నేతలు అక్కల గాంధీ, శ్రీ వేగుళ్ల లీలాకృష్ణ, పోతిరెడ్డి అనిత, బొలియాశెట్టి శ్రీకాంత్, బొలిశెట్టి వంశీకృష్ణ, బాడిత శంకర్, తిరుపతి అనూష, కె.ఎస్.ఎన్.మూర్తి, ఠాకూర్ అజయ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.


## 'ఆపరేషన్ సిందూర్ 2.0'... లాహెూర్ లోని ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్, రాడార్లను ధ్వంసం చేసిన భారత్



ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త : పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు భారత్ మరోసారి గట్టిగా బుద్ధి చెప్పింది. నిన్న రాత్రి భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ జరిపిన దాడులకు సమాధానంగా ఈ ఉదయం భారత సాయుధ దళాలు పాకిస్థాన్‌లోని పలు వ్యూహాత్మక ప్రాంతాల్లో ఉన్న ఎయిర్ డిఫెన్స్ రాడార్లు, వ్యవస్థలపై దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో లాహెూర్‌లోని ఓ ముఖ్యమైన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ, రాడార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' అనంతరం పాకిస్థాన్ నుంచి ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. దీనికి కొనసాగింపుగా, నిన్న రాత్రి పాకిస్థాన్ డ్రోన్లు, క్షిపణుల సాయంతో ఉత్తర, పశ్చిమ భారతదేశంలోని పలు సైనిక లక్ష్యాలపై దాడులకు విఫలయత్నం చేసింది. అవంతిపుర, శ్రీనగర్, జమ్మూ, పఠాన్‌కోట్, అమృత్‌సర్, కపుర్తలా, జలంధర్, లూధియానా, అదంపూర్, భటిండా, చండీగఢ్, నల్, ఫలోడి, ఉత్తర్‌లాయ్, భుజ్ వంటి ప్రాంతాలు ఈ లక్ష్యాలలో ఉన్నాయి. అయితే, భారత ఇంటిగ్రేటెడ్ కౌంటర్ యూఏఎస్ గ్రిడ్, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ఈ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టాయని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పాకిస్థాన్ జరిపిన దాడులకు సంబంధించిన శకలాలు పలుచోట్ల లభ్యమయ్యాయని, ఇవి పాక్ దుశ్చర్యలకు నిదర్శనమని పేర్కొంది. భారత ప్రభుత్వం విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, "ఈరోజు ఉదయం భారత సాయుధ బలగాలు పాకిస్థాన్‌లోని అనేక ప్రాంతాల్లో ఎయిర్ డిఫెన్స్ రాడార్లు, వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నాయి. పాకిస్థాన్ ఏ స్థాయిలో, ఏ పద్ధతిలో స్పందించిందో, అదే స్థాయిలో, అదే పద్ధతిలో భారత్ ప్రతిస్పందించింది. మన దాడులతో లాహెూర్‌లోని ఒక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసమైందని విశ్వసనీయంగా తెలిసింది" అని పేర్కొంది.

## రాష్ట్రానికి వచ్చేందుకు 91 పెద్ద కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి

### ఐటి, ఎలక్ట్రానిక్స్, ఆర్ టిజిఎస్ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్రంలో కొత్తగా తమ సంస్థలను ఏర్పాటుచేయడానికి ముందుకు వచ్చిన పెద్ద కంపెనీలకు అవసరమైన అనుమతులను త్వరితగతిన మంజూరుచేసేందుకు ప్రతికంపెనీకి ఒక నోడల్ ఆఫీసర్ ను నియమించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల ఉన్నతాధికారులతో లోకేష్ సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... విశాఖ నగరాన్ని అత్యాధునిక సాంకేతికతల కేంద్రంగా, ఐటి హబ్ గా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం ప్రణాళికలు రూపొందించాలని కోరారు. రాష్ట్రంలో యూనిట్ల స్థాపనకు ఆసక్తిచూపుతున్న కంపెనీల పెట్టుబడులు, ఉద్యోగాలపై మంత్రి సమీక్షిస్తూ ఇప్పటివరకు 91 ఐటి, ఎలక్ట్రానిక్స్ కంపెనీలు రూ. 91,839 కోట్ల పెట్టుబడులు, 1,41,407 ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వచ్చాయి, వాటికి త్వరితగతిన అనుమతులు మంజూరుచేయాలి, సాధ్యమైనంత త్వరగా కంపెనీలు ఏర్పాటుచేసేలా సంబంధిత కంపెనీల ప్రతినిధులతో సంప్రదింపులు జరపాలి. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఐటి, ఎలక్ట్రానిక్స్ ఉద్యోగాలు కీలకపాత్ర పోషిస్తాయి, రాబోయే అయిదేళ్లలో ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని లోకేష్ అన్నారు. ఐటి కంపెనీలకు చెల్లించాల్సిన ప్రోత్సాహక బకాయిలను వెంటనే చెల్లించండి. రాష్ట్రవ్యాప్తంగా వీడియో కాన్ఫరెన్స్ ఎక్విప్ మెంట్ ను ఆధునీకరించండి. రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ ఏర్పాట్లను వేగవంతం చేయండి.

ప్రభుత్వానికి సంబంధించిన పౌరసేవలన్నీ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందుబాటులో ఉంచాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. ప్రస్తుతం 317రకాల సేవలు మనమిత్ర యాప్ లో అందుబాటులో ఉన్నాయి. నెలాఖరుకు 400రకాల సేవలకు విస్తరించండి. రెవిన్యూశాఖతో పాటు వివిధరకాల సేవల సమయాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి సర్టిఫికెట్ బ్లాక్ చెయిన్, క్యూఆర్ కోడ్ తో నిర్ధారించుకునేలా టెక్నాలజీతో అనుసంధానం చేయాలి. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, పంచాయితీల్లో పన్నుల బకాయిల వివరాలు వాట్సాప్ లో వచ్చేలా ఏర్పాట్లు చేయాలి, బకాయిలకు సంబంధించి ఎప్పటికప్పుడు అలర్ట్ మెసేజ్ లు పంపేలా చూడాలి. ఆర్ టిజిఎస్ కు సంబంధించి డేటా పాయింట్లు, కెపిఐలను ఇంటిగ్రేట్ చేయాలి. భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాధాన్య పథకాలనకు సంబంధించి రియల్ టైమ్ సమాచారాన్ని ఆర్ టిజిఎస్ లో పొందుపర్చాలి. సచివాలయం నుంచి గ్రామస్థాయి కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ను అనుసంధానం చేయండి. తుపానులు, వరదలు, పిడుగులు పడటం వంటి వాతావరణ సమాచారాన్ని రియల్ టైమ్ లో అందించేలా చర్యలు తీసుకోండి. జూన్ 9,10 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే ఈ-గవర్నెన్స్ జాతీయ సదస్సుకు విస్తృత ఏర్పాట్లు చేయండి. వివిధ శాఖలకు సంబంధించి సమాచారాన్ని అంతటినీ ఏకీకృతం చేసి ఒక వెబ్ సైట్ లో పొందుపర్చి ఎఐ ఎనేబుల్ చేసేలా చర్యలు తీసుకోవాలి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను మరింత సరళతరం చేసేలా చర్యలు చేపట్టాలి. వివిధ రకాల చిరు వ్యాపారాలు, చిన్న పరిశ్రమలకు సంబంధించి సింగిల్ సర్టిఫికేషన్ ఉండేలా క్యూఆర్ కోడ్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ అనుసంధానించాలి. ప్రభుత్వానికి సంబంధించి అన్నిరకాల జిఓలు, యాప్ లను సింగిల్ ప్లాట్ ఫాంపైకి తెచ్చి ఒకే వెబ్ సైట్ లో అందుబాటులోకి తేవాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటి అండ్ సి సెక్రటరీ కాటంనేని భాస్కర్, స్పెషల్ సెక్రటరీ బి.సుందర్, ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు సిఇఓ సాయికాంత్ వర్మ, ఎపి టెక్నాలజీ సర్వీసెస్ ఎండి సూర్యతేజ్, ఆర్ టిజిఎస్ సిఇఓ ప్రకార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

## భారత గగనతలంలోకి పాక్ క్షిపణులు.. ఎస్-400తో ధ్వంసం, హార్పీ డ్రోన్లతో రాడార్లపై దాడి!

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : పంజాబ్ సరిహద్దు ప్రాంతాల్లోని గ్రామాల పొలాల్లో లభ్యమైన క్షిపణి శకలాలు ఎక్కడివన్నది తేలిపోయింది. అవి పాక్ ప్రయోగించగా, భారత్ వాటిని మార్గమధ్యంలోనే తుత్తునియలు చేసింది. భారత నగరాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ ప్రయోగించిన క్షిపణులను భారత వాయుసేన సమర్థవంతంగా తిప్పికొట్టింది. రష్యా నుంచి



సమకూర్చుకున్న అత్యాధునిక ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ (సుదర్శన చక్ర) ద్వారా సుమారు 15 పాక్ క్షిపణులను కూల్చివేసినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ పరిణామం అనంతరం, పాకిస్థాన్ ఎయిర్ డిఫెన్స్ రాడార్ వ్యవస్థలను నిర్వీర్యం చేసేందుకు ఇజ్రాయెల్ తయారీ హార్పీ డ్రోన్లను భారత్ ప్రయోగించినట్లు తెలుస్తోంది. ఈ దాడుల్లో లాహెూర్‌లోని కీలక రాడార్‌తో సహా పలు వ్యవస్థలు ధ్వంసమైనట్లు సమాచారం. వార్తా సంస్థ ఏఎన్ఐ కథనం ప్రకారం, భారత గగనతలంలోకి ప్రవేశిస్తున్న 'కదిలే లక్ష్యాల'ను పసిగట్టిన ఎస్-400 వ్యవస్థ, వాటిని విజయవంతంగా అడ్డుకుంది. దీని తర్వాత, శత్రువుల గగనతల రక్షణ వ్యవస్థలను అణచివేయడంలో ప్రసిద్ధి చెందిన హార్పీ డ్రోన్లను భారత్ రంగంలోకి దించింది. ఈ డ్రోన్లు శక్తివంతమైన పేలుడు పదార్థాలను మోసుకెళ్లడమే కాకుండా, రేడియేషన్ వెలువరించే లక్ష్యాలను స్వయంగా గుర్తించి, వాటిపై దాడి చేయగల ప్రత్యేక నేవిగేషన్ వ్యవస్థను కలిగి ఉంటాయి. నిర్దేశిత ప్రాంతంలోని లక్ష్యాలను ఏ దిశ నుంచైనా ఛేదించగల సామర్థ్యం వీటికి ఉంది. పగలు, రాత్రి వేళల్లో సుమారు తొమ్మిది గంటల పాటు సుదూర లక్ష్యాలపై దాడులు చేయగలవని నిపుణులు చెబుతున్నారు. కాగా, భారత్ 'సుదర్శన చక్ర'గా అభివర్ణించే ఎస్-400 రక్షణ వ్యవస్థలు, ప్రపంచంలోనే అత్యంత ఆధునాతనమైనవిగా పేరుపొందాయి. ఇవి దాదాపు 600 కిలోమీటర్ల దూరం నుంచే శత్రు క్షిపణులను గుర్తించి, 400 కిలోమీటర్ల పరిధిలో వాటిని కూల్చివేయగలవు. ఈ తాజా పరిణామాలు ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేసే అవకాశం ఉందని రక్షణ రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను భారత్ ధ్వంసం చేసిన మరుసటి రోజే, పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాలపై డ్రోన్లతో దాడులు జరిగినట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా కరాచీ, లాహెూర్ వంటి ప్రధాన నగరాలపై ఈ దాడులు జరిగినట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ దాడుల్లో ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ (ఐఏఐ) అభివృద్ధి చేసిన హార్పీ డ్రోన్లను భారత్ ఉపయోగించినట్లు తెలుస్తోంది.

హార్పీ డ్రోన్ల ప్రత్యేకతలు: ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ (ఐఏఐ) అభివృద్ధి చేసిన హార్పీ డ్రోన్ వ్యవస్థను తొలిసారిగా 1989లో ప్రవేశపెట్టారు. అనేక ఆధునిక మార్పులతో ఇది మరింత శక్తివంతంగా తయారైంది. ముఖ్యంగా, హార్పీ ఎన్‌జీ (నెక్స్ట్ జనరేషన్) వేరియంట్, 'ఫైర్ అండ్ ఫర్గెట్' పద్ధతిలో పనిచేసే స్వతంత్ర ఆయుధంగా పేరుగాంచింది. ఇది శత్రు రాడార్ వ్యవస్థలను గుర్తించి, అకస్మాత్తుగా వాటిపై పడిపోతుంది. ఆత్మాహుతి దాడికి పాల్పడి లక్ష్యాలను నాశనం చేస్తుంది. ప్రధానంగా శత్రువుల గగనతల రక్షణ వ్యవస్థలను నిర్వీర్యం చేయడమే దీని లక్ష్యం. ఐఏఐ ప్రకారం, హార్పీ ఎన్‌జీ ఒక వ్యూహాత్మక ఆయుధం. దీనిని భూమిపై నుంచైనా లేదా నౌకల్లోని కానిస్టర్ల నుంచైనా ప్రయోగించవచ్చు. సుదూర లక్ష్యాలను ఛేదించగల ఈ డ్రోన్లు, శత్రు గగనతలంలో సురక్షిత మార్గాలను ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఐఏఐ ఇతర అధునాతన డ్రోన్లు: ఐఏఐ రూపొందించిన సుదూర లక్ష్య ఛేదిత గాల్లో చక్కర్లు కొట్టే ఆయుధాల జాబితాలో హార్పీ ఎన్‌జీతో పాటు హారోప్, మినీ హార్పీ కూడా ఉన్నాయి. హారోప్ డ్రోన్, హార్పీ నుంచి అభివృద్ధి చేయబడింది. ఇది భూమి, నౌకల నుంచి ప్రయోగించగలదు మరియు కదిలే, స్థిర లక్ష్యాలపై దాడి చేయగలదు. మినీ హార్పీ ట్రిపుల్ సీకర్ వ్యవస్థతో ప్రతికూల వాతావరణంలోనూ లక్ష్యాలను ఛేదించగలదు.

## దయచేసి భారత్ నుంచి పాకిస్థాన్‌ను కాపాడండి



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య దాడులు, ప్రతిదాడులు చోటుచేసుకుంటున్నాయి. నిన్న ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన భారత్, నేడు పాక్ గగనతల రక్షణ వ్యవస్థలపై విరుచుకుపడింది. లాహెూర్, ఇస్లామాబాద్, కరాచీ, గుజ్రాన్‌వాలా సహా మొత్తం 12 నగరాలపై డ్రోన్లు కలకలం రేపాయి. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో పాకిస్థాన్ ఎంపీ ఒకరు వారి పార్లమెంటులో ఒకింత కన్నీటి పర్యంతమయ్యారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, పాకిస్థాన్ పార్లమెంట్‌లో సదరు పార్లమెంట్ సభ్యుడు కన్నీటిపర్యంతమైన దృశ్యాలు సామాజిక మాధ్యమంలో వైరల్ అయ్యాయి.సదరు ఎంపీ పార్లమెంట్‌లో మాట్లాడుతూ, "దయచేసి భారత్ నుంచి పాకిస్థాన్‌ను కాపాడండి. మిమ్మల్ని వేడుకుంటున్నాను" అని రోదిస్తూ అభ్యర్థించారు. "ఇది మా తప్పిదమో, మా లోపమో, లేదా మరేదైనా కారణమో తెలియదు కానీ, ప్రస్తుతం మమ్మల్ని అన్నిచోట్లా నిందితుల్లా పరిగణిస్తున్నారు. మనమందరం దేవుడిని క్షమాపణ కోరాలి" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## సొంతూరులో పరిశ్రమలు పెట్టండి

### ఇదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్న మంత్రి సవిత



పెనుకొండ/రొద్దం,నేటి పత్రిక ప్రజావార్త : 'ఎక్కడెక్కడో పరిశ్రమలు ఏర్పాటు చేసే బదులు సొంతూరులో కంపెనీలు పెట్టండి.. మన ప్రాంతాల అభివృద్ధిలో భాగస్వాములవ్వండి.. మన యువతకు ఉద్యోగిలిచ్చి... రాష్ట్రానికి, దేశానికి ఆదాయం వచ్చేలా సహకరించండి' అని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, యువతకు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దడమే లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నారని మంత్రి తెలిపారు. రొద్దంలో 59.37 ఎకరాల్లో ఏర్పాటు చేయబోతున్న ఎంఎస్ఎంఈ పార్కుకు మంత్రి సవిత మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏపీని పారిశ్రామిక హబ్ గా సీఎం చంద్రబాబు అభివృద్ధి చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా యువతను వ్యాపారవేత్తలుగానూ తీర్చిదిద్దే మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులు, ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొదటి దశలో 50 పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రొద్దంలో 59.37 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**తొలి దశలో 20 ఎకరాల్లో...** రొద్దం ఎంఎస్ఎంఈ పార్కులో తొలి దశలో 20 ఎకరాల్లో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. 115 పరిశ్రమలకు ఏడు సెంట్లు చొప్పున భూ కేటాయింపులు చేస్తున్నట్లు వెల్లడించారు. రూ. 7 కోట్లతో రోడ్లు, కాలువలు, వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సాహవంతులైన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, యువకులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని మంత్రి కోరారు.

**సొంతూర్లో పరిశ్రమలు పెట్టండి...** రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు రేయింబవళ్లు కృషి చేస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. ముఖ్యంగా రాయలసీమను రతనాల సీమగా తీర్చిదిద్దడానికి అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ఒకవైపు రాయలసీమలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తూనే, మరో వైపు సాగునీటి కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ పరిశ్రమల ఏర్పాటుకు ఎంఎస్ఎంఈ పార్కులను తమ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. కియా లాంటి అంతర్జాతీయ పరిశ్రమలను ఏర్పాటు చేయడంతో వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లా రూపురేఖలే మారిపోయాయన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, యువత ఎక్కడో పరిశ్రమలు ఏర్పాటు చేసే బదులు, సొంతూర్లోనే కంపెనీలు ఏర్పాటుకు ఎంఎస్ఎంఈ పార్కులు ఎంతగానో దోహదపడతాయన్నారు. స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేయడం వల్ల అక్కడి యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఇతర ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటు వల్ల వచ్చే ఆదాయం అక్కడి ప్రభుత్వాలకు, ప్రజలకు ఉపయోగపడతుందన్నారు. స్థానికంగా పరిశ్రమల ఏర్పాటు చేయడం వల్ల ఇక్కడి ఆదాయం...స్థానిక ప్రజలకు, ప్రభుత్వానికి లభ్యమవుతుందన్నారు.

**చంద్రబాబు రాకతో పారిశ్రామిక రంగానికి ఊతం...** గత వైసీపీ ప్రభుత్వం పారిశ్రామిక రంగాన్ని నిర్వీర్యం చేసిందని మంత్రి సవిత మండిపడ్డారు. రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా అడ్డుకున్నారని, ఉన్న పరిశ్రమలను రాష్ట్రం నుంచి బయటకు పంపించేశారని అన్నారు. జే ట్యాక్స్ చెల్లించాలంటూ పారిశ్రామిక వేత్తలను వేధించారని, ఫలితంగా ఏపీలో పారిశ్రామికాభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని అన్నారు. దీనివల్ల ఉద్యోగాల్లేక యువత రోడ్డున పడ్డారని మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబునాయుడు మరోసారి అధికారంలోకి రావడంతో, పారిశ్రామిక రంగానికి ఊతమొచ్చిందని తెలిపారు. ఎందరో బడా పారిశ్రామిక వేత్తలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొస్తున్నారని మంత్రి సవిత వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


# తెలుగు సైనికులు యుద్ధానికి సిద్ధం

## -రాష్ట్ర మాజీ సైనికుల సంక్షేమ సంఘ



గుంటూరు, నేటి పత్రిక ప్రజావార్త : పాకిస్థాన్‌తో యుద్ధానికి ఆంధ్ర ప్రదేశ్‌లోని మాజీ సైనికులు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర మాజీ సైనికుల సంక్షేమ సంఘ అధ్యక్షులు మోటూరు శంకరరావు అన్నారు. గుంటూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ మాజీ సైనికులు సంక్షేమ సంఘ అనుబంధ విభాగం శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు సైనికులను యుద్ధభూమికి పంపించవలసిందిగా ప్రధాని మోడీని కోరారు. దీనికోసం ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు భారత రక్షణ శాఖతో చర్చించి యుద్ధభూమికి పంపించవలసిందిగా ఆయన కోరారు. ఆంధ్రప్రదేశ్ లోని 685 మండలాల్లో లక్షమంది మాజీ సైనికులున్నారని రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఐనంపూడి రత్న ప్రసాద్ తెలిపారు. ఇందులో 25 వేలమంది మాజీ సైనికులు పాకిస్థాన్ తో యుద్ధానికి సంసిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యాక్షులు పుసులూరు లక్ష్మీనారాయణ మాట్లాడుతు భారత దేశం మీసం తిప్పిందని శత్రువులను పారద్రోలెందుకు పౌరుషం పరుగు తీస్తుందన్నారు. సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సేక్రెటరి వాకా ఆదినారాయణ ఎంచిన కొండల రావు తడితరులు పాల్గొన్నారు.

# బహ్రెయిన్ దేశంలో ఘనంగా శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు




అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అదేశాలు మేరకు అమరజీవి పొట్టిశ్రీరాములు గారి 125వ జయంతి వేడుకలు ఏడాది పాటు నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగానే ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు ఉన్న దేశాలల్లో పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించడం జరుగుతుంది. అంతర్జాతీయంగా తొలిసారిగా బహ్రెయిన్ దేశంలో తెలుగుకళాసమితి అధ్యక్షులు పి.జగదీష్ అధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.. ఈ సందర్భంగా ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ మాట్లాడుతూ.. తెలుగు ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రసాధన కోసం ప్రాణత్యాగం చేసిన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు ఆయన త్యాగం మరువలేనిదని అన్నారు. పొట్టి శ్రీరాములు జీవితం భావితరాలకు ఆదర్శమన్నారు. తెలుగువారి క్షేమం, అభివృద్ధి కోసం తన జీవితాన్ని అర్పించిన త్యాగమూర్తి అని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీపొట్టి శ్రీరాములు జీవిత చరిత్రను వీడియో రూపంలో ప్లే చేయడం జరిగింది..కార్యక్రమానికి బహ్రెయిన్ దేశంలోని తెలుగు ప్రజలు భారీగా పాల్గొన్నారు.

# రైతు నాయకుల ఆత్మీయ సమ్మేళనం



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త: విజయవాడ నగరంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు అతీతంగా కృషిచేస్తున్న రైతు నాయకుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. సోమవారం గాంధీనగర్‌లోని ఓ ప్రైవేట్ హొటల్‌నందు జరిగిన కార్యక్రమంలో రైతు సేవా సంస్థ అధ్యక్షులు అక్కినేని భవానీప్రసాద్ సభాధ్యక్షులుగా వ్యవహరించారు. భారీ సాగునీటి ప్రాజెక్టులలో గేట్లను నిర్మించటంలోనూ, నిర్వహణలోనూ ప్రముఖ ఇంజనీరు కన్నయ్య నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ...1971లో తిరుపతి వెంకటేశ్వరస్వామి యూనివర్సిటీలో ఇంజనీరింగ్‌పూర్తి చేసి అప్పటి నుంచి వాటర్ రీసోర్సెస్ అన్ని డివ్స్ ఆఫ్ గేట్స్, ఎక్విప్‌మెంట్‌లో అనుభవం పొంది గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అండర్ టేకింగ్‌లో పనిచేసి రిటైర్ అయి కూడా ఇప్పటి కూడా పనిచేస్తూ సుమారు 500 ప్రాజెక్టులకు గేట్లు అమర్చి రైతులకు నీళ్ళు ఇవ్వడం జరిగింది. సౌత్ ఇండియాలో గుజరాత్‌లోనూ, మహారాష్ట్రలోనూ మన 4 రాష్ట్రాల్లో వుండే అన్ని రకాల ప్రాజెక్టుచేసి మనవాళ్ళకు రైతులకు ఏ ఇబ్బంది వచ్చినా ఆదుకుంటూ వుంటాను. ఇప్పటికి నా 53 ఏళ్ళ అనుభవంతో ఈ ఫీల్డులో పోయిన సంవత్సరం ఆగస్టులో తుంగభద్ర 14 లక్షల ఎకరాల పంట ఎండిపోతుందనప్పుడు స్టాప్ బ్లాక్స్ లేకపోయినా ఐఎంలో గేటు ఏర్పాటుచేసి కొట్టుకుపోయిన గేటులా ఏర్పాటుచేసి నీళ్ళు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రకాశం బ్యారేజీలో వరదల సమయంలో బోట్లు వచ్చి కొట్టినపుడు గేట్లు మార్చి రిపేరు చేసి గేట్లు బలం పెంచినట్లు తెలిపారు. ఇప్పుడు రాష్ట్రంలో వున్న మిగతా ప్రాజెక్టులను స్టడీచేసి వాటిని ఎలా ఇంప్రూవ్ చేసి రైతులకు ఎలా నీళ్ళు ఇవ్వాలని సలహాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడు సోమశిల, తిరుపతిలో వుండే ప్రాజెక్టులు, ప్రకాశం బ్యారేజీలో తదితర ప్రాజెక్టుల ఇంప్రూవ్‌మెంట్ తదితర విషయంలో సలహాలు రైతులకు అందిగా వుంటానని తెలిపారు. అలాగని ప్రభుత్వాలకు వ్యతిరేకంగా రైతులకు ఎక్కడ సమస్య వున్నాకూడా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సభాధ్యక్షులు అక్కినేని భవానీ మాట్లాడుతూ ప్రసాద్ సమావేశాన్ని ప్రధానంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం జరగాలంటే రాజకీయాలకు అతీతంగా పనిచేసే సంఘం వుండాలే అవకాశం వుంటుందని తన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. అందుకనే రాజకీయ పార్టీలకు అతీతంగా వుండే రైతు సంఘం ద్వారానే రైతుల సమస్య పరిష్కారానికి అవకాశం వుంటుందని తన అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనికి 3 అంచెల విధానాన్ని అవలంభించాలని అసెంబ్లీస్థాయి లెవెల్, పార్లమెంట్‌స్థాయి లెవెల్, రాష్ట్ర స్థాయి లెవెల్‌లో రైతు సంఘాన్ని ఏర్పాటుచేసుకుని మన సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. దాని కోసమే ఈ సమావేశం ఏర్పాటుచేశామన్నారు. దాదాపు 26 జిల్లాల నుంచి రిప్రజెంటేషన్ వచ్చిందన్నారు. దానిమీద ఒక అడహక్ కమిటీని ఏర్పాటుచేసుకుని రాబోయే 3 నెలల్లో దీనికి ఒక విస్తృత రూపాన్ని ఇచ్చి ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళతామన్నారు. ఈ సందర్భంగా కొన్ని తీర్మానాలు చేయడం జరిగిందన్నారు. అవి 'సరోగా' ప్రోగ్రాంని వ్యవసాయరంగానికి అనుసంధానం చేయడానికి పరిశీలనచేసి అమలు చేయడానికి ప్రయత్నం, పోలవరం ప్రాజెక్టు 45.73 మీటర్ల ఎత్తులో నిర్మించాలని గోదావరి ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుని నూటికి నూరుపాళ్ళు అమలు చేసే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వుంది కాని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించింది కాబట్టి కేంద్ర ప్రభుత్వమే చొరవ తీసుకుని ఖచ్చితమైన అభిప్రాయాన్ని ప్రజలకు ముందుకు తీసుకురావాల్సిన అవసరం వుందన్నారు. సోమనాథన్ కమీషన్ సూచించిన విధంగా సి2+50% ఇస్తే తప్ప రైతుకు గిట్టుబాటు కాదని అంశం ఏదైతే వుందో దానిని చట్టబద్దతగా కేంద్రం రైతుకు అందించాలన్నారు. రాజ్యాంగ పరంగా వ్యవసాయం అనేది రాష్ట్రాల పరిధిలో వున్న అంశం అయినప్పటికీ కంట్రోల్స్ అన్నీ కేంద్రం ప్రభుత్వమే నిర్ణయిస్తుంది ఉదాహరణకు ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్స్, క్రాప్ ఇన్సూరెన్స్, లోన్స్ తదితర విషయాలు పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే వుంది. కాబట్టి వ్యవసాయాన్ని..... లిస్టులో తీసుకురావాలనేది మా ప్రధానమైన డిమాండ్ అని అన్నారు. ఈ విధంగా చర్యలు తీసుకుంటే కొన్ని సమస్యలకు పరిష్కారంలో లభించవచ్చు. అలాగే నేషనల్ హైవే, ఎలక్ట్రిసిటీ లైన్స్‌కి కోసం రైతుల దగ్గర తీసుకున్న పొలానికి సరైన ధర లభించడం లేదన్నారు. ఈ విషయంలో సరైన విధానంలో చేయవలసిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై వుంది కాబట్టి ఆదిశగా డిమాండ్ చేస్తున్నామన్నారు. సమన్వయ కమిటీ చైర్మన్ వట్టికొండ జయరామయ్య, మాజీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావులు మాట్లాడుతూ రైతులు తన తరువాత తరం రైతాంగ వ్యవస్థలోకి వారు రావాలనే ఆకాంక్ష వారిలో లేదని, రైతులేనిది మనం తినే ధాన్యం పండిరచేవారు కొరవడే ఇబ్బందికర పరిస్థితులు వున్నాయని అటువంటివి ఏర్పడకుండా రైతుకు తగిన ప్రాధాన్యత ఇచ్చి రైతు సమస్యలు తీర్చి రైతులను సంక్షోభం నుండి బయటకు తీసుకురావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చలసాని శ్రీనివాసరావు, ఐసిఎఆర్ న్యాఢల్లీ అవార్డుగ్రహిత జి.వెంకటరామరాజు, నాయకులు వి.రామ్మోహన్‌రావు, 26 జిల్లాల వివిధ సంఘాల నుండి వివిధ ప్రాంతాల రైతులు, వివిధ విభాగాలకు చెందిన ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కారించండి..



ఒంగోలు, నేటి పత్రిక ప్రజావార్త : ఒంగోలు రెవిన్యూ డివిజన్ అధికారి (ఆర్డీవో) కె.లక్ష్మీప్రసన్నని ఒంగోలులోని వారి కార్యాలయంలో భారతీయ జనతా మజ్దూర్ సెల్ (BJMC) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఖలీఫాతుల్లాబాషా మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఒంగోలు నగర శివారున వెంగముక్కపాలెంలో ఉన్న భగీరథ కెమికల్ ఫ్యాక్టరీలో కార్మికుల పలు సమస్యలు తమ దృష్టికి వచ్చాయని దీని పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. భగీరథ కెమికల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులకు కల్పిస్తున్న సౌకర్యాలు నామమాత్రంగా ఉన్నాయన్న సమాచారంతో పాటు అక్కడి కార్మికులకు PF, ESI లు ఎంతమందికి వర్తిస్తున్నాయో దీనిపై సమగ్ర విచారణ జరిపించి అక్కడి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. అన్ని రంగాలలో పనిచేస్తున్న అసంఘటిత కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం కార్మికుల భద్రత గుర్తింపునిస్తూ ఈ-శ్రమ్ కార్డును ఇవ్వడం జరిగింది, అయితే ఈ కార్డు గురించి చాలా మందికి తెలియక ఈ-శ్రమ్ కార్డు పొందలేక పోతున్నారని ఒంగోలు రెవిన్యూ డివిజన్ పరిధిలో ఉన్న అసంఘటిత కార్మికులు భద్రత దృష్టిలో ఉంచి తమ సిబ్బందితో అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేసి కార్మికులకు ఈ-శ్రమ్ కార్డులు అందేటట్లు చూడాలని కోరారు. కార్మికుల సమస్యలపై వెంటనే స్పందిస్తూ అసంఘటిత కార్మికుల శ్రేయస్సు భద్రత దృష్టిలో ఉంచి తన పూర్తి సహకారం అందిస్తానని ఆర్డీవో లక్ష్మి ప్రసన్న హామీ ఇచ్చారు.

# వల్లభనేని వంశీకి బెయిల్ మంజూరు

విజయవాడ –గన్నవరం వైఎస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి బెయిల్ మంజూరైంది.. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో అరెస్టైన వల్లభనేని వంశీ బెయిల్ కోసం ఎస్సీ ఎస్టీ కోర్టులో బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు.. విచారించిన కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో ఇప్పటికే రెండు సార్లు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు వంశీ.. రెండు సార్లు కూడా బెయిల్ తిరస్కరించింది కోర్టు.. దీంతో.. మూడోసారి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు వంశీ.. ఆ పిటిషన్‌పై ఇటీవల ఇరు వర్గాల తరపు న్యాయవాదులు వాదనలు విన్న కోర్టు.. ఈ రోజు వల్లభనేని వంశీ మోహన్‌కు బెయిల్ మంజూరు చేసింది.. ఈ కేసులో వల్లభనేని వంశీ తో పాటు మరో నలుగురు నిందితులకు కూడా బెయిల్ ఇచ్చింది విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం.. అయితే, వల్లభనేని వంశీ మొదట సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో అరెస్ట్ అయినా.. ఆ తర్వాత ఆయనపై వరుసగా మరిన్ని కేసులు నమోదు అయ్యాయి.. వంశీపై మొత్తం ఆరు కేసులు పెట్టారు.. ఆ ఆరు కేసుల్లో ఐదు కేసుల్లో బెయిల్, ముందస్తు బెయిల్ పొందారు వల్లభనేని వంశీ మోహన్.. కానీ, గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఇంకా వంశీకి బెయిల్ రాలేదు.. ఈ కేసులో ప్రస్తుతం రిమాండ్ లో ఉన్నారు వంశీ.. దీంతో, ఇప్పుడు సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో బెయిల్ వచ్చినా.. ఆయన జైలులో ఉండాల్సిన పరిస్థితి ఉంది.. కాగా, సత్య వర్ధన్ కిడ్నాప్ కేసులో ఫిబ్రవరి 13వ తేదీన హైదరాబాద్‌లో వల్లభనేని వంశీ మోహన్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం విదితమే..




# తెలంగాణ వార్తలు



# భారత సైన్యం ప్రదర్శించిన పాటవానికి ఒక భారతీయుడిగా నేను గర్వపడుతున్నాను: కేసీఆర్



తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత సైన్యంపై మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రశంసలు కురిపించారు. ఒక భారతీయుడిగా తాను గర్వపడుతున్నానని ఆయన పేర్కొన్నారు. ఉగ్రవాదం సమూలంగా అంతం కావాల్సిందేనని ఆయన అభిప్రాయపడ్డారు. "భారత సైన్యం ప్రదర్శించిన సైనిక పాటవానికి ఒక భారతీయుడిగా నేను గర్వపడుతున్నాను" అని సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఉగ్రవాదం, ఉన్మాదం ఏ రూపంలో ఉన్నా, ఏ దేశంలో ఉన్నా అది ప్రపంచ మానవాళికి తీవ్ర నష్టం కలిగిస్తుందని, దాని వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని కచ్చితంగా అంతమొందించాలని ఉద్ఘాటించారు. ప్రపంచ శాంతి, సామరస్యాలు నెలకొనాలంటే ఉగ్రవాద నిర్మూలనకు సానుకూల దృక్పథంతో ఆలోచించే ప్రపంచ శక్తులన్నీ ఏకతాటిపైకి రావాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. అప్పుడే ఉగ్రవాదాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని, శాంతిని స్థాపించగలమని తెలిపారు. భారత సైన్యం ఎంతటి వీరోచితంగా దాడులు నిర్వహించిందో, అంతే అప్రమత్తతతో దేశ రక్షణ విధుల్లో నిమగ్నమై ఉండాలని కేసీఆర్ ఆకాంక్షించారు. దేశ రక్షణ విషయంలో తామెవరికీ తీసిపోమని నిరూపించేలా మన సైనికులకు అపారమైన శక్తి సామర్థ్యాలు ఉండాలని తాను భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ మేరకు సైన్యం నిరంతర అప్రమత్తతతో, శక్తియుక్తులతో వర్ధిల్లాలని కేసీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# హైడ్రా అలాంటి సమస్యలను కూడా పరిష్కరిస్తోంది



హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : హైదరాబాద్ నగరంలో ముంపు బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారాలు అందించడంలో హైడ్రా కీలక పాత్ర పోషిస్తోందని ఆ సంస్థ కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హైడ్రా కార్యక్రమంలో భాగంగా, సికింద్రాబాద్‌లోని బుద్ధ భవన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హైడ్రా పోలీస్ స్టేషన్ భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హైడ్రాకు కేటాయించిన నూతన వాహనాలు, యంత్రాలను కూడా సీఎం ఆవిష్కరించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ, ప్రజలు ఏ ప్రభుత్వ విభాగాన్ని సంప్రదించాలో తెలియని క్లిష్టమైన సమస్యలను సైతం హైడ్రా స్వీకరించి, పరిష్కరిస్తోందని తెలిపారు. "ఏదైనా సమస్య మా పరిధిలోకి రాదని చెప్పి మేం ఎప్పుడూ గిరిగీసుకోలేదు. ఏ శాఖకు సంబంధించిన బాధ్యత అయినా, తక్షణమే స్పందించి ఆ పనిని మేం పూర్తి చేస్తున్నాం" అని వివరించారు. హైడ్రా చొరవ కారణంగా నగరంలో చెరువులు, నాలాల ఆక్రమణలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని రంగనాథ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా హైడ్రా చేపడుతున్న వివిధ కార్యక్రమాలను, వాటి ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను ఆయన వివరంగా తెలియజేశారు.

# కేంద్ర జల సంఘం చైర్మన్‌తో ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ



తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు ముఖ్యమైన జల వివాదాలు, ప్రాజెక్టుల పురోగతి, నీటి కేటాయింపులపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా పలు ప్రతిపాదనలను ఆయన కేంద్రం ముందుంచారు. మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ అంశం ఈ సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చింది. బ్యారేజీ మరమ్మతులు, భవిష్యత్తు కార్యాచరణపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర జలసంఘం చైర్మన్‌కు వివరించారు. జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) ఇచ్చిన నివేదికలో మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం, డిజైన్‌లో స్పష్టమైన లోపాలున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌లో ఒక ప్రాంతంలో నిర్మిస్తామని ప్రతిపాదించి, ఆచరణలో మరోచోట నిర్మాణం చేపట్టారని మంత్రి తెలిపారు. ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకు సీడబ్ల్యూసీలో సమగ్రంగా చర్చించి తదుపరి నిర్ణయాలు తీసుకోవాలని, ఈ అంశంపై ప్రస్తుతం అధ్యయనం జరుగుతోందని ఆయన వెల్లడించారు. ప్రజాధనం ఏమాత్రం వృథా కాకుండా చూస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కృష్ణా నదిపై టెలిమెట్రీల ఏర్పాటుకు సంబంధించి అవసరమైన నిధులను ఇప్పటికే కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కి అందజేసినట్లు మంత్రి ఈ సందర్భంగా కేంద్ర జలసంఘం చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తొలి విడతకు 45 టీఎంసీల నీటిని, అలాగే సమ్మక్క–సారక్క బ్యారేజీకి 44 టీఎంసీల నీటిని కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు, పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కారణంగా తెలంగాణ భూభాగంలో ఎదురయ్యే ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా నష్ట నివారణ చర్యలు చేపట్టాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరులో కృష్ణా, విజయనగరం, ప్రకాశం జిల్లాలు ముందంజ

## -ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలుపై మంత్రి సుదీర్ఘ సమీక్ష




అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా స్థాయిలో వివిధ ఆరోగ్య సేవలు, పథకాలు అమలవుతున్న తీరుపై ఆరోగ్య శాఖా మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ మంగళవారం నాడు మూడున్నర గంటల పాటు సుదీర్ఘ సమీక్ష చేపట్టారు. జిల్లాల వారీగా అమలు తీరును సోదాహరణంగా వెల్లడించి ర్యాంకులను ప్రకటించారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు వివిధ పథకాల అమలును పర్యవేక్షించే జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు(డిఎంహెచ్వోలు) మరియు జిల్లా ఆరోగ్య సేవల సమన్వయకర్తలు(డిసిహెచ్‌యస్‌లు) పనితీరుపై కొంత అసంతృప్తిని వ్యక్తం చేసి వారు జవాబుదారీ తనంతో పనిచేసే దిశగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. జిల్లా వైద్యాధికారుల కార్యాలయాలపై వస్తున్న అవినీతి ఆరోపణలపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసి, అవినీతిని అడ్డుకట్ట వేయడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలోని జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు (డీఎంహెచ్‌వోలు), జిల్లా ఆరోగ్య సేవల సమన్వయకర్తల (డీసీహెచ్ఎస్‌లు)తో మంగళవారం నాడు వెలగపూడిలోని ఏపీ సచివాలయం నుండి వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఇతర విభాగాధిపతులు సమీక్షా సమావేశంలో పాల్గొనగా ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వీరపాండియన్ వర్చువల్‌గా పాల్గొన్నారు.

**జిల్లాలవారీ పనితీరు..** అంతర్గత మదింపు ప్రకారం జిల్లాల వారీగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల్ని అందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పిహెచ్‌సిలు) మరియు పట్టణ ప్రాంతాల్లో పనిచేసే పట్టణ పిహెచ్‌సిల పనితీరును మంత్రి వెల్లడించారు. ఈ విషయంలో ఉమ్మడి కృష్ణా జిల్లా మొదటి స్థానంలోనూ, విజయనగరం మరియు ప్రకాశం జిల్లాలు ఆ తరువాతి స్థానంలోనూ ఉన్నాయని ఆయన తెలిపారు. అనంతపురం జిల్లా పనితీరులో అట్టడుగు స్థానంలో ఉండగా, మిగిలిన 3 రాయలసీమ జిల్లాలు క్రింది స్థానాల్లో ఉండడంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆందోళన వెలిబుచ్చారు. ఆయా జిల్లాల పనితీరుకు సంబంధించి జిల్లా వైద్యాధికారుల నుంచి వివరణ అడిగారు. ఈ పరిస్థితిని మెరుగుపర్చడానికి తగు చర్యల్ని చేపట్టాలని ఆయన ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరులో వెనుకబడడంతో పాటు రాయలసీమలోని సెకండరీ ఆసుపత్రుల పనితీరుపై కూడా మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. నిర్దేశిత లక్ష్యాల్లో 7 జిల్లాలు 10 శాతం(అనంతపురం, కర్నూలు)నుంచి 24 శాతం( తిరుపతి జిల్లా) మేరకే శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. చిత్తూరు జిల్లాలో మాత్రం 42 శాతం మేరకు శస్త్ర చికిత్సలు జరిగాయి. ఆసుపత్రుల్లో జరిగే ప్రసవాల్లో కూడా రాయలసీమ ప్రాంతంలోని ప్రభుత్వ సెకండరీ ఆసుపత్రుల తీరు మెరుగుపడాలని మంత్రి సూచించారు. దీంతోపాటు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవల వినియోగంలో రాయలసీమ జిల్లాల్లోని సెకండరీ ఆసుపత్రులు బాగా వెనుకబడడంపై మంత్రి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వైయస్సార్ జిల్లాలోని సెకండరీ ఆసుపత్రులు చేసిన సర్జరీల్లో కేవలం 3 శాతమే ఎన్టీఆర్ వైద్య సేవలో నమోదయ్యాయి. మొత్తమ్మీద రాయలసీమ జిల్లాల్లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద గరిష్ఠంగా 25 శాతం చికిత్సలు మాత్రమే నమోదవడం ఆందోళనకరమని, ఈ విషయంలో కనీసం 30 శాతం శస్త్ర చికిత్సలు ఎన్టీఆర్ వైద్య సేవలో నమోదు చేయడానికి తగు చర్యలు చేపట్టాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు.


**జిల్లా వైద్యాధికారుల పనితీరును మెరుగుపర్చేందుకు చర్యలు అవినీతిని అడ్డుకునేందుకు నిర్ణయాలు..** జిల్లా వైద్యాధికారుల పనితీరుపై ఆరోగ్య రంగంలో ఆయా జిల్లాల ప్రగతి ఆధారపడి ఉంటుందని, ఈ విషయంలో మరింత మెరుగైన ఫలితాలను సాధించడానికి సమీక్షా సమావేశంలో సుదీర్ఘ చర్చ అనంతరం మంత్రి కొన్ని నిర్ణయాల్ని ప్రకటించారు. వీరి పనితీరుపై పర్యవేక్షణాలోపం, పనితీరు అంచనా మరియు రిపోర్టింగ్‌లో ఉన్న లోపాల్ని మంత్రి ఎత్తి చూపారు. జిల్లా వైద్యాధికారుల కార్యాలయాలు అవినీతికి అడ్డాలుగా మారాయని వస్తున్న వార్తలు, ప్రజాభిప్రాయంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆశించిన మేరకు పరిపాలనా అనుభవం లేని జిల్లా వైద్యాధికారులు కింది స్థాయి పాలనా సిబ్బందిపై ఆధారపడడంతో పలు అక్రమాలు జరుగుతున్నాయని మంత్రి అన్నారు. జిల్లా స్థాయిలో జరిగే నియామకాలు కేవలం ప్రతిభ ఆధారంగా జరగాల్సి ఉన్నా ఉద్యోగాలిప్పిస్తామంటూ జిల్లా కార్యాలయాల్లో అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేయడంపై మంత్రి సత్యకుమార్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దీన్ని అరికట్టేందుకు ఆయా జిల్లా వైద్యాధికారులు నియామక సమయాల్లో ప్రతిభ ఆధారిత ఎంపిక విషయాన్ని వెల్లడిస్తూ, అభ్యర్థులెవరూ దళారుల బారిన పడొద్దని పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. జిల్లా అధికారుల పాలనా సామర్థ్యాన్ని పెంచి కింది స్థాయి సిబ్బందిపై ఆధారపడకుండా చేసేందుకు తగు శిక్షణా కార్యక్రమాల్ని చేపట్టాలని కూడా మంత్రి సత్యకుమార్ యాదవ్ నిర్ణయించారు. జిల్లా కార్యాలయాల్లో కింది పాలనా సిబ్బంది దీర్ఘ కాలంపాటు పనిచేయడం వల్ల అక్రమాలకు తావిస్తోందని, దీన్ని అడ్డుకునేందుకు వారిని మూడేళ్లకోసారి బదిలీ చేయాలని మంత్రి ఆదేశించారు. వైద్యాధికారులు, పాలనా సిబ్బంది వ్యవహార శైలికి సంబంధించి పలు మార్గాల ద్వారా సమాచారాన్ని సేకరించుకుని అక్రమార్కులపై ముందస్తు చర్యలు చేపట్టే వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని మంత్రిత్వ శాఖలోని సంబంధిత ఉన్నతాధికారుల్ని మంత్రి ఆదేశించారు. జిల్లా వైద్యాధికారులు, పాలనా సిబ్బందిలో ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుంటారన్న భయం లేకుండా పోయిందని, ఈ పరిస్థితిలో తగు మార్పు తేవడానికి మంత్రిత్వ శాఖలోని సంబంధిత ఉన్నతాధికారులు అవసరాల మేరకు తక్షణమే స్పందించి, తగు చర్యలు చేపట్టి , అక్రమాలకు వ్యతిరేకంగా సరైన సందేశాన్నివ్వాలని మంత్రి స్పష్టం చేశారు. జవాబుదారీ తనంతో జిల్లా వైద్యాధికారులు పనిచేసేందుకు ఏడాదికి రెండు సార్లు వారి పనితీరును మదింపు చేసి పనితీరు బాగోలేదు, బాగుంది, చాలా బాగుంది అని గ్రేడ్లు ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. ప్రతి అధికారి తమ పరిధిలో ఉన్న ప్రతి సెంకడరీ ఆసుపత్రిని నిర్దిష్ట కాలపరిమితిలో సందర్శించి అక్కడి లోటుపాట్లపై నివేదికలు సమర్పించాలని సమీక్షా సమావేశంలో నిర్ణయించారు. వారి క్షేత్రస్థాయి పర్యటనలకు సంబంధించి స్పష్టమైన విధివిధానాల్ని రూపొందించి వాటి ద్వారా ప్రయోజనకరమైన నివేదికలు ఉన్నతాధికారులకొచ్చేలా చూడాలని మరో నిర్ణయాన్ని తీసుకున్నారు. జిల్లా వైద్యాధికారుల పనితీరుపై క్రమం తప్పకుండా తనకు నివేదికలు సమర్పించాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రజల ఆరోగ్యం కోసం ఎంతో కృషి చేస్తున్నా ప్రచార మాధ్యమాల్లో వస్తున్న వ్యతిరేక వార్తల ద్వారా నష్టం జరుగుతోందని, సానుకూల ప్రజాభిప్రాయం కోసం వివిధ ఆసుపత్రులు చేస్తున్న సేవల వివరాలను, విశిష్టతను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ మీడియాలో వస్తున్న వ్యతిరేక వార్తలకు సంబంధించి వాస్తవాల్ని ప్రజలకు తెలియజేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు.

# చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ని కలిసిన సీఎం చంద్రబాబు



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ తో సీఎం చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. విజయవాడలోని బందర్ రోడ్డులోని ప్రధాన న్యాయమూర్తి అధికారిక నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. ఇది కేవలం మర్యాదపూర్వక భేటీ అని అధికారిక వర్గాలు తెలిపాయి.

# రూ.304 లక్షలతో 33/11 కేవి విద్యుత్తు ఉప కేంద్రానికి శంఖుస్థాపన



అచ్చంపేట, నేటి పత్రిక ప్రజావార్త : పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గం సామర్లకోట మండలం అచ్చంపేట గ్రామంలో రూ.304 లక్షలతో 33/11 కేవి విద్యుత్తు ఉప కేంద్రానికి మంగళవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, శాసనమండలి సభ్యులు కర్రి పద్మశ్రీ, పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చిన్నరాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ పెద్దాపురం శాసనసభ్యులు చినరాజప్ప తన నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం యువ పారిశ్రామికవేత్తలకు విస్తృత అవకాశాలు కల్పిస్తుందని పారిశ్రామిక, వ్యాపార అభివృద్ధి కోసం రాష్ట్ర వ్యాప్తంగా 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నాంమన్నారు. ఖాళీ స్థలాలను జగన్ కబ్జా చేస్తే%ాా% కూటమి ప్రభుత్వం పారిశ్రామిక వాడలను నిర్మిస్తుందని మంత్రి తెలిపారు. జగన్ అధికారాన్ని స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటే..కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం లక్ష్యంగా పని చేస్తోందన్నారు. పేదోడి ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను పునరుద్ధరించా మన్నారు. దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్నాం మంత్రి లోకేష్ నాయకత్వంలో నిరుద్యోగ యువతకు మెగా డీఎస్సీకి ప్రకటించామని, వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు బిక్కుబిక్కుమంటూ భయంతో కాలం గడిపారని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలందరూ సంతోషంగా, స్వేచ్ఛగా జీవిస్తున్నారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఏటా విద్యుత్ వినియోగం ఆరు నుంచి ఎనిమిది శాతం పెరుగుతుందని, రాష్ట్రంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. గ్రామాలకు 24 గంటలు, వ్యవసాయానికి 9 గంటలు నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నూతన విద్యుత్తు సబ్ స్టేషన్లను అవసరం ఉన్నచోట ప్రాధాన్యత క్రమంలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో సంబంధించి వివిధ గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కార నిమిత్తం ఎమ్మెల్యే చినరాజప్ప తన దృష్టికి తీసుకు వచ్చిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజా, ఏపీఈపీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

